# కాంగ్రెస్‌కు రాజిరెడ్డి రాజీనామా





- బీఆర్ఎస్‌లో చేరిక
- మంత్రి వివేక్ వెంకటస్వామి ఒంటెద్దు పోకడలపై అసంతృప్తి
- 200 కార్ల కాన్వాయ్‌తో హైదరాబాద్‌కు పయనం
- కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్న మాజీ జడ్పీ వైస్ చైర్మన్

**శెనార్థి మీడియా, మంచిర్యాల (చెన్నూర్):**

మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లు వెలువడిన తరుణంలో నియోజకవర్గ కాంగ్రెస్‌లో భారీ కుదుపు చోటుచేసుకుంది. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి అత్యంత సన్నిహితుడిగా ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజీరెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను డీసీసీ జిల్లా అధ్యక్షుడికి పంపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో వివేక్ వెంకటస్వామి విజయం కోసం తనదైన పాత్ర పోషించి ఎనలేని కృషి చేసిన రాజీరెడ్డి, ప్రస్తుతం ఎమ్మెల్యే తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అమలుకాని హామీలు.. పెరిగిన వ్యతిరేకత..**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోవడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని రాజీరెడ్డి విమర్శించారు. ముఖ్యంగా చెన్నూరు నియోజకవర్గానికి వివేక్ వెంకటస్వామి ఇచ్చిన ప్రత్యేక హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలు, నియంతృత్వ ధోరణి వల్ల పార్టీ శ్రేణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, క్షేత్రస్థాయిలో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని లేఖలో పేర్కొన్నారు. ఈ మోసపూరిత వైఖరిని నిరసిస్తూ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

**తెలంగాణ భవన్‌కు భారీ ర్యాలీ...**

కాంగ్రెస్‌ను వీడిన రాజీరెడ్డి తన తదుపరి కార్యాచరణను ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో చెన్నూరు నుంచి సుమారు 200 కార్లతో భారీ కాన్వాయ్‌గా హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌కు బయలుదేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆయన గులాబీ గూటికి చేరనున్నారు. మున్సిపల్ ఎన్నికల ముంగిట సీనియర్ నాయకుడు రాజీరెడ్డి పార్టీని వీడటం చెన్నూరులో కాంగ్రెస్‌కు పెద్ద ఎదురుదెబ్బగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

- పాఠశాలలు, కళాశాలల్లో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు
- ట్రాఫిక్ నిబంధనల పాటించడమే రక్షణ కవచం
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

**శెనార్థి మీడియా, మంచిర్యాల / రామగుండం:**

రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" (సురక్షిత ప్రయాణం – క్షేమంగా గమ్యాని కి) కార్యక్రమంలో భాగంగా రామ గుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విస్తృ త అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వ్యాప్తంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించినట్లు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ ఆదేశాలతో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గులు, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ద్వారా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పట్ల విద్యార్థుల్లో బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝూ మాట్లాడుతూ... దేశంలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో మెజారిటీ మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయసు నుంచే రోడ్డు నియమాలపై అవగాహన ఉండాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం, వేగ నియంత్రణ, సిగ్నల్స్ పాటించడం ద్వారా ప్రాణాలు కాపాడుకోవచ్చని సూచించారు. విద్యార్థులు ఈ విషయాలను తమ కుటుంబ సభ్యులకు కూడా వివరించాలని కోరారు. భవిష్యత్ పౌరులైన విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని, ప్రతి ఒక్కరూ క్షేమంగా గమ్యానికి చేరడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమనిస్పష్టం చేశారు.

# జిల్లాలో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్
- 'నా భారత్ - నా ఓటు' నినాదంతో చైతన్య కార్యక్రమాలు
- అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ప్రచారం
- కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ

**శెనార్థి మీడియా, మంచిర్యాల :**

ఈ నెల 25వ తేదీన 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో, ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "నా భారత్ – నా ఓటు" అనే నినాదంతో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తామని తెలిపారు. ఓటరు దినోత్సవం సందర్భంగా పోస్టర్లు, బ్యానర్లు, ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు ఓటు వేసేలా ప్రోత్సహిస్తూ వారిని స్ఫూర్తిగా నిలపనున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, రైల్వే, పంచాయతీరాజ్ తదితర శాఖలు, కార్పొరేట్ సంస్థల సహకారంతో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, సెమినార్లు నిర్వహించి ఓటు ఆవశ్యకతను వివరిస్తామని చెప్పారు. కొత్తగా నమోదైన ఓటర్లను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రాంతీయ భాషలో ఈవీఎం, వీవీ ప్యాట్, పోస్టల్ బ్యాలెట్, హెల్ప్ లైన్ యాప్‌లపై అవగాహన వీడియోలు ప్రదర్శిస్తామన్నారు. దినపత్రికలు, టీవీ ఛానళ్లు, హోర్డింగ్‌లతో పాటు వాట్సాప్ గ్రూపుల ద్వారా ఓటరు ప్రతిజ్ఞను అందరికీ చేరవేస్తామని వివరించారు. జిల్లాలో నిర్వహించే ఈ వేడుకను అందరూ కలిసి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు

# మత్స్యగిరీంద్ర స్వామి జాతర పోస్టర్ విడుదల



**శెనార్థి మీడియా, శంకరపట్నం:**

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణ శనివారం శంకరపట్నం మండలంలో పర్యటించారు. కొత్తగట్టు శ్రీ మత్స్యగిరీంద్ర స్వామి జాతర పోస్టర్‌ను మండల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కేశవపట్నం మాజీ సర్పంచ్ బండారి తిరుపతి, తాడికల్ గ్రామానికి చెందిన రాణవేణి గణేష్ కుటుంబాలను పరామర్శించారు. ఈ పర్యటనలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ వార్డుల రిజర్వేషన్లు ఖరారు



- రాజకీయ పార్టీల సమక్షంలో ప్రక్రియ పూర్తి
- ఐదు మున్సిపాలిటీల్లో 149 వార్డులకు కేటాయింపులు
- పారదర్శకంగా నిర్వహణ
- కలెక్టర్ కుమార్ దీపక్



**శెనార్థి మీడియా, మంచిర్యాల:**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని మున్సిపల్ వార్డుల రిజర్వేషన్లు ఖరారయ్యాయి. శనివారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. కలెక్టర్ కుమార్ దీపక్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ రిజర్వేషన్ల కేటాయింపును పూర్తి చేశారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల పరిధిలో ఉన్న వార్డులకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లోని 60 డివిజన్లు, బెల్లంపల్లిలో 34 వార్డులు, క్యాతనపల్లిలో 22 వార్డులు, చెన్నూర్ లో 18 వార్డులు, లక్షెట్టిపేటలోని 15 వార్డులకు కేటాయింపులు ముగిశాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ మహిళా, జనరల్ స్థానాలను నిబంధనల ప్రకారం కేటాయించినట్లు అధికారులు వెల్లడించారు. వార్డుల రిజర్వేషన్ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. రాజకీయ పార్టీల సమక్షంలోనే లాటరీ పద్ధతిలో ఈ ప్రక్రియ సాగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## నూతన కార్యాలయ ప్రారంభోత్సవం



**శెనార్థి మీడియా, శంకరపట్నం:** కరీంనగర్ జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) సభ్యుడు పడాల రాహుల్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా శంకరపట్నం మండల యూత్ కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆడెపు అజయ్, వైస్ ప్రెసిడెంట్ గొర్ల ఆంజనేయులు, కార్యదర్శి గండికోట రవి, నాయకులు నూనె శ్రీకాంత్, కనకం మహేష్, చల్ల రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లోకి మొలంగూర్ ఉపసర్పంచ్



**శెనార్థి మీడియా, శంకరపట్నం:** మండలంలోని మొలంగూర్ ఉపసర్పంచ్ దండు రాజేశ్, ఆరుగురు వార్డు సభ్యులు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండు వాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు.

# అంగరంగవైభవంగా శివకళ్యాణం





**శెనార్తిమీడియా, గంగాధర :** గంగాధర మండలం కోట్లనర్సింహులపల్లి వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శని వారం శివ కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సవమూర్తులకు మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి కల్యాణానికి కరీంనగర్, జగిత్యాల, వరంగల్ నుంచి భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఉత్సవమూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ రాచమల్ల రవి, పూజారులు పాల్గొన్నారు




# గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

- రామడుగు ప్యాక్స్ మాజీ చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్ రావు
- ప్రీమియర్ లీగ్ సీజన్ 2 విజేతలకు బహుమతుల అందజేత

**శెనార్తిమీడియా, రామడుగు :**

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని రామడుగు ప్యాక్స్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వర్రావు అన్నారు. వివేకానంద జయంతి, సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన క్రికెట్ ప్రీమియర్ లీగ్ సీజన్ 2 క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు వేడుకలకు వెంకటేశ్వర్రావు ముఖ్యఅతిథిగా హాజరై విన్నర్, రన్నర్ జట్లకు బహుమతులు, నగదును అందజేశారు. అలాగే ప్రతి మ్యాచ్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులకు మెమొంటోలు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లమ్మల వసంత, వార్డు మెంబర్లు, ఎల్ఐసీ డీవో వీర్ల హన్మంతరావు, బీఆర్ఎస్ నాయకుడు వీర్ల సంజీవ్రావు, నాయకులు పాల్గొన్నారు.

# మొలంగూర్ లో వైభవంగా వీరభద్ర స్వామి కళ్యాణం





- కనులపండువగా అగ్నిగుండాల మహోత్సవం
- బ్రహ్మోత్సవాలకు పోటెత్తిన భక్తజనం
- పలు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

మొలంగూర్‌లోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహిస్తున్న 2026 బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున ఆలయ ప్రాంగణంలో అగ్నిగుండాలు, స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ప్రధా న అర్చకులు గొల్యాల గంగాధర స్వామి, కన్నయ్య ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య ఉత్సవమూర్తులకు కళ్యాణం జరిపించారు. కోరిన కోరికలు తీర్చే దైవంగా పేరొందిన వీరభద్ర స్వామిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అగ్నిగుండాల వేడుకను వీక్షించేందుకు భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. వేడుకల్లో గ్రామ సర్పంచ్ పూదరి రాజు, మాజీ సర్పంచులు దండు సాయిలు, మోరె అనూష శ్రీనివాస్, నరహరి శారద బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వావిలాల రాజు, రాయిని లలితా దేవి శంకరయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పుల్లూరి వీరేశం, కమిటీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# తల్లిదండ్రులు బరువు అవుతున్నారు..

## జాన్వీ కపూర్ సంచలన కామెంట్స్

జాన్వీ కపూర్ మాట్లాడే మాటలు ఆలోచించేలా చేస్తాయి. ఏ టాపిక్ అయినా సరే డెప్త్‌గా మాట్లాడుతుంది. తల్లిదండ్రుల సంరక్షణ విషయంలోనూ తను చెప్పిన మాటలు మోటివేట్ చేసేలా ఉన్నాయి. ఈ తరానికి మంచి మెసేజ్ ఇస్తున్నాయి. 'ఇండియన్ కల్చర్‌లో వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను కాపాడటం పిల్లల బాధ్యత. ఒక వయసు తర్వాత వాళ్లు మనకు పిల్లలు అవుతారు. చాలా మంది తమ తల్లిదండ్రుల వల్ల నాశనమైపోయామనే ఫీలింగ్‌లో ఉంటారు. కానీ మీ వల్ల వారు కూడా అదే పరిస్థితిని అనుభవించి ఉంటారు. ఒకరినొకరు క్షమించుకోండి. ప్రేమను పంచండి. మనది వెస్టర్న్ కల్చర్ కాదు కదా.. వదిలేసి వెళ్లిపోవడానికి.. మనకు ఆ బాధ్యతలను చిన్నప్పటి నుంచే నేర్పించారు కదా' అని చెప్పింది. ఇక ఇప్పుడు తన తండ్రిని చిన్నపిల్లాడిలా చూసుకుంటున్నామని.. ఖుషీ, తాను ఒకరికొకరు తల్లిగా ఉ ంటున్నామని చెప్పింది జాన్వీ.

# హిట్టు కొట్టి చూపించా

## వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా : శర్వానంద్

'నారీ నారీ నడుమ మురారి'తో చెప్పి మరీ హిట్టు కొట్టాన'ని కథానాయకుడు శర్వానంద్ అన్నారు. ఈ కథ విన్న తొలిరోజు నుంచే ఇది తనకెంతో నమ్మకాన్ని కలిగించిందని.. ఈ సినిమా ఎప్పుడు విడుదల చేసినా తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవుతుందని ముందే ఊహించానని.. ఇప్పుడా నమ్మకం నిజమైనందుకు ఆనందంగా ఉందని తెలిపారు. శర్వా హీరోగా నటించిన ఈ సినిమాని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. నరేశ్, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు శ్రీను వైట్ల అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ.. 'ఇది నాకు చాలా ఎమోషనల్ మూమెంట్. హిట్ కొడతానని చెప్పి మరీ కొట్టాను. సంక్రాంతికి రావాలన్న నా కల నెరవేర్చినందుకు నిర్మాత అనిల్‌కు ధన్యవాదాలు. నేను చాలా రోజులుగా హిట్ కోసం ఎదురు చూస్తున్నా. నాకు ఆ హిట్ ఇచ్చిన దర్శకుడు రామ్ అబ్బరాజుకు కృతజ్ఞతలు. ఈ చిత్రానికి మరో హీరో నరేశ్. మా నాన్న పాత్ర పోషించారు. సినిమా చూసిన వాళ్లంతా 'చాలా రోజుల తర్వాత ఇంతలా నవ్వుకున్నామ'ని చెప్తుంటే ఆనందంగా అనిపించింది. నేనెప్పుడు సంక్రాంతికి వచ్చినా అన్ని సినిమాలు ఆడతాయి. అందుకే ఇకపై ప్రతి సంక్రాంతికి నాకోసం ఒక స్లాట్ పక్కన పెట్టండి ..వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా. శ్రీను వైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీస్ నిర్మించనున్న నా తదుపరి సినిమా పండక్కే వస్తుందని అన్నారు. పండగ చివర్లో రావడం వల్ల ఎక్కువ థియేటర్లు ఇవ్వలేకపోయాం. కానీ, వచ్చే వారం నుంచి స్క్రీన్స్ పెరగబోతున్నాయి. ఇది చాలా పెద్ద హిట్ కొట్టబోతుందని అన్నారు నిర్మాత దిల్‌రాజు.



# యుఫోరియా అందరికీ కనెక్ట్ అవుతుంది

## ట్రైలర్ విడుదలలో దర్శకుడు గుణశేఖర్



'యుఫోరియా'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు దర్శకుడు గుణశేఖర్. ఆయన దర్శకత్వంలో భూమిక, సారా అర్జున్, గౌతమ్ వాసుదేవ్ మేనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న చిత్రమిది . ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా గుణ శేఖర్ మాట్లాడుతూ ఈ సినిమా అందరినీ ఆలోచింపచేస్తుందన్నారు. యుఫోరియా'కు ప్రతి కుటుంబంలో ఒకరు కనెక్ట్ అవుతారు. కొత్త వాళ్లతో ఈ సినిమా చేయాలని 6 నెలలు ఆడిషన్స్ చేశాం. 20 మంది కొత్తవారిని తీసుకున్నాం. టీనేజ్ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైన వయసు. ఈ సినిమాలోని ప్రధాన పాత్రల్లో నటించినవారు అందరూ టీనేజ్ వాళ్లే. కథ వింటున్నప్పుడే సారా అర్జున్ అయితే బాగుంటుందని నిర్మాత నీలిమ చెప్పింది. సారా అర్జున్ నటిస్తేనే ఈ సినిమా తీద్దాం లేదంటే ఆపేద్దాం అని ఆమెతో చెప్పా. రేపు సినిమా చూశాక కూడా అందరూ ఇదే అంటారు. అంత గొప్పగా నటించింది. ఈ అమ్మాయి వయసు 17 ఏళ్లు అయినా.. చాలా ఉన్నతంగా ఆలోచిస్తుంది. ఈ రోజుల్లో ఇలాంటి కథ కచ్చితంగా ప్రేక్షకుల చెప్పాలి అని వెంటనే ఓకే చేసేసిందని అన్నారు. ఇందులో ఎంతో కీలకమైన మరో పాత్ర వింధ్య.. ఈ పాత్ర కోసం భూమికని తీసుకుందాం అని నీలిమ చెప్పగానే వద్దు అన్నాను. ఎందుకంటే భూమికను తల్లి పాత్రలో చూడడం నాకు ఇష్టం లేదు. తను ఎప్పటికీ నాకు ఒక్కడు'లో స్వప్నగానే కనిపిస్తుంది. కానీ, ఆమె అయితేనే ఈ పాత్రకు న్యాయం చేస్తుందనిపించింది. వెళ్లి అడగ్గానే కొడుతుందేమో అనుకున్నా.. స్క్రిప్ట్ చదివి ఓకే చేసింది. కొందరు నటీమణులు కేవలం గ్లామర్ పాత్రలే చేస్తామంటున్నారు. భూమిక ఈ సినిమాలో 17 ఏళ్ల అబ్బాయికి అమ్మగా నటించి వాటిని బ్రేక్ చేసింది. 'యుఫోరియా' రిలీజ్ అయిన తర్వాత ఆమె కచ్చితంగా ప్రశంసలు అందుకుంటుంది. అంటూ గుణశేఖర్ ప్రశంసలు కురిపించారు.

# చేతులు మారిన మద్రాస్ ఎన్టీఆర్ ఇల్లు

## కొత్తగా తీర్చిదిద్దుతున్న చదలవాడ సోదరులు



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, నటుడు, దివంగత ఎన్.టి.రామారావు నివసించిన చెన్నైలోని ఇల్లు నందమూరి సోదరుల నుంచి చదలవాడ సోఓదరుల చేతుల్లోకి వెళ్లింది. దానిని అమ్మేయడంతో ఇప్పుడు వారు పూర్వపుశోభ తీసుకొచ్చే దిశగా పునరుద్ధరణ పనులు చేపట్టారు. జరుగుతున్నాయి. ఇవి పూర్తయిన తర్వాత ప్రజలు సందర్శించడానికి అనుమతించనున్నారు. నేడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన ఇంటికి సంబంధించిన వివరాలు వెల్లడయ్యాయి. చెన్నై త్యాగరాయనగర్‌లోని బజుల్లా రోడ్డులో సుమారు వెయ్యి గజాల విస్తీర్ణంలో ఉన్న ఇంటిని 1953లో ఎన్టీఆర్ తన సతీమణి బసవతారకం పేరిట కొనుగోలు చేశారు. ఈ ఇల్లు ఆయనకు ఎంతో కలిసి వచ్చిందని చెబుతారు. కొన్నేళ్లకు కళా విహీనంగా మారిన ఆ ఇంటికి పూర్వపు వైభవం తీసుకొచ్చేందుకు పలువురు అభిమానులు ప్రయత్నించినా సుమారు 30 మంది వారసులు ఉండటంతో ఆ ప్రయత్నాలు కొలిక్కిరాలేదు. ప్రస్తుతం ఆ ఇంటిని తాము కొనుగోలు చేసినట్లు నందమూరి కుటుంబానికి సన్నిహితులు, బంధువులైన చదలవాడ సోదరులు తిరుపతిరావు, శ్రీనివాసరావు వెల్లడించారు. ఆ ఇంటికి మ-రమ్మతు పనులు ప్రారంభించారు. నిర్మాణశైలిని మార్చకుండా తీర్చిదిద్దుతున్నారు. ఇంటి ముందు ఉన్న ఫ్లైవర్ పైనుంచి వెళ్లేవారు చూసినా కనిపించేలా ఇంటి ప్రధాన ద్వారం పైన 'శ్రీకృష్ణపాండవీయం' చిత్రంలో సుయోధనుడి పాత్రలో కనిపించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రజలు ఎన్టీఆర్ ఇంటిని చూసి ఆనందించేలా ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇటీవల చదలవాడ శ్రీనివాసరావు వెల్లడించారు. ఎన్టీఆర్ నివాసం అప్పట్లో అభిమానులతో కళకళలాడేది. పలువురు అభిమానులు మద్రాస్‌కు చేరుకుని తమ అభిమాన నటుడు ఎన్టీఆర్‌ను కనులారా చూసి ఆనందించేవారు. తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు తరలడం, ఎన్టీఆర్ కుటుంబం చెన్నైను వీడటం వంటి కారణాలతో ఆ ఇంటిని పట్టించుకునేవారు లేకపోయారు.




# మరో భిన్నమైన కథతో ధనుష్.. కర మూవీ

రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు పరిమితం కాకుండా, ఎప్పటికప్పుడు కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్న తమిళ స్టార్ ధనుష్ మరోసారి వార్తల్లో నిలిచారు. కథల ఎంపికలో తనకంటూ ప్రత్యేకమైన స్టైల్‌ను కొనసాగిస్తున్న ధనుష్, గత ఏడాది మూడు భాషల్లో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించాడు.గత ఏడాది తెలుగులో 'కుబేరా', తమిళంలో 'ఇడ్లీ కడాయ్', హిందీలో 'తేరే ఇష్క్ మేన్' చిత్రాల్లో నటించిన ధనుష్, ఈ మూడింటిలో 'ఇడ్లీ కడాయ్' మినహా మిగిలిన రెండు సినిమాలతో బ్లాక్‌బస్టర్ విజయాలను అందుకున్నాడు. ఈ విజయాలతో మరోసారి తన మార్కెట్‌ను మరింత పెంచుకున్న ఈ హీరో, ఇప్పుడు మరో సరికొత్త పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఆ సినిమానే 'కర'. 'పోర్ తోజిల్' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని తాజాగా సంక్రాంతి కానుకగా మేకర్స్ టైటిల్‌తో పాటు టీజర్‌ను విడుదల చేశారు. విడుదలైన టీజర్ ఒక్కసారిగా సినిమాపై అంచనాలను భారీగా పెంచింది.రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ధనుష్ ఇప్పటివరకు చేయని కొత్త రోల్‌లో కనిపించనున్నాడని టీజర్ చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది. మట్టి వాసనతో కూడిన కథనం, పవర్‌ఫుల్ ప్రెజెన్స్‌తో ధనుష్ కనిపించిన తీరు అభిమానులను ఆకట్టుకుంటోంది. కథ, పాత్ర పరంగా ఈ సినిమా పూర్తిగా భిన్నంగా ఉండబోతోందనే సంకేతాలు టీజర్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# మన శంకరవరప్రసాద్ గారు రూ.226 కోట్లకు పైగా గ్రాస్ వసూలు




టాలీవుడ్‌లో సంక్రాంతి సీజన్‌ను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకున్న సినిమాగా 'మన శంకర వరప్రసాద్ గారు' నిలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, విజయవంతమైన దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ పండగకు విడుదలై థియేటర్లలో జోరుగా సాగుతోంది. ప్రమోషన్ల దశ నుంచే భారీ అంచనాలు ఏర్పడగా, విడుదల తర్వాత ఆ అంచనాలను వసూళ్ల రూపంలో నిజం చేస్తోంది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు తరలిరావడంతో అన్ని ప్రాంతాల్లోనూ షోలు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. వీకెండ్ కావడంతో కలెక్షన్లు మరింత ఊపందుకున్నాయి. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లోనూ ఈ సినిమానే ముందంజలో ఉంది. బుక్‌మైషో వేదికగా ఇప్పటివరకు దాదాపు 2.5 మిలియన్ల టికెట్లు అమ్ముడవడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనం.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమా తొలి రోజే భారీ ఓపెనింగ్‌ను నమోదు చేసింది. ఆ తర్వాత రోజురోజుకీ వసూళ్లు పెరుగుతూ మూడో రోజుకు రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను, నాలుగో రోజుకు రూ.200 కోట్ల క్లబ్‌ను దాటింది. తాజాగా ఐదు రోజుల కలెక్షన్లను మేకర్స్ అధికారికంగా ప్రకటించగా, ప్రపంచవ్యాప్తంగా రూ.226 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు వెల్లడించారు. ఇది ఒక ప్రాంతీయ సినిమాకు ఆల్‌టైమ్ రికార్డు అని పేర్కొంటూ స్పెషల్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేశారు.నిర్మాతల ప్రకటనలో 'ప్రతి మార్కెట్‌లో 'మన శంకర వరప్రసాద్ గారు' డామినేషన్ కొనసాగుతోంది. మెగా సంక్రాంతి బ్లాక్‌బస్టర్‌గా ఈ చిత్రం ఐదు రోజుల్లోనే రూ.226 కోట్లకు పైగా గ్రాస్ సాధించింది. ఇది రీజినల్ సినిమా చరిత్రలో అరుదైన ఘట్టం' అని పేర్కొన్నారు. వీకెండ్ మొత్తం సినిమా ట్రెండ్ కొనసాగుతుందని కూడా వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా నయనతార నటించగా, విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించారు. వీటీవీ గణెళిష్, యూట్యూబర్ నందన తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644